
వర్సిటీ హోదా వచ్చేనా ?

- జాతీయస్థాయిలో ఎస్కీ, నిథమ్‌లకు గుర్తింపు
- కాంగ్రెస్ సర్కారు వచ్చాక చిగురించిన ఆశలు

రాయదుర్గం: జాతీయ స్థాయిలో గుర్తింపు పొందిన ఉన్నత విద్య, శిక్షణ సంస్థల యూనివర్సిటీ హోదా రాష్ట్ర ప్రభుత్వ పరిశీలనకే పరిమితమయ్యాయి. గచ్చిబౌలిలోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టూరిజమ్ అండ్ హాస్పిటాలిటీ మేనేజ్‌మెంట్ (నిథమ్), ఇంజనీరింగ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియా (ఎస్కీ) రెండు సంస్థలు కూడా గతంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్నప్పుడే ఏర్పడ్డాయి. ఈ క్రమంలో ప్రస్తుతం కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉండడంతో యూనివర్సిటీ గుర్తింపు వస్తుందనే ఆశలు చిగురిస్తున్నాయని చెప్పవచ్చు. ఈ రెండు సంస్థలకు యూనివర్సిటీ హోదా ఇవ్వాలని రాష్ట్ర ప్రణాళికా బోర్డు కూడా రాష్ట్ర ప్రభుత్వానికి సిఫార్సు చేసినట్లు తెలిసింది.

చిగురిస్తున్న ఆశలు..

ప్రస్తుతం రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉండడంతో హోదా లభిస్తుందని ఎదురుచూస్తున్నారు. కాగా నిథమ్‌ను ప్రారంభించింది కూడా కాంగ్రెస్ పార్టీ అధినేత సోనియాగాంధీ, అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి కావడంతో దీనికి ప్రాధాన్యత పెరిగింది. కేంద్ర, రాష్ట్ర ఉద్యోగులు, ఇంజనీర్లుకు ఎస్కీ శిక్షణ ఇవ్వడం, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేసిన పథకాలకు కూడా తనవంతు చేయూత, సూచనలతో కూడిన నివేదికలను అందిస్తుండడంతో ఈ రెండు



టెలికామ్‌నగర్‌లోని 'నిథమ్' ప్రాంగణం



గచ్చిబౌలిలోని 'ఎస్కీ' ప్రాంగణం

సంస్థలకు త్వరలో యూనివర్సిటీ హోదా వస్తుందనే భావన సిబ్బందిలో నెలకొంది.

ఆసియా ఖండంలోనే ఏకైక అత్యున్నత శిక్షణ, విద్యాసంస్థగా గుర్తింపు పొందింది గచ్చిబౌలిలోని 'ఇంజనీరింగ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియా (ఎస్కీ). ఇది ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజనీర్స్ (ఇండియా) ద్వారా ఏర్పాటు చేయబడిన స్వయంప్రతిపత్తి సంస్థగా గుర్తింపు పొందింది. దీన్ని 1981లో గచ్చిబౌలిలో 70 ఎకరాల్లో స్థాపించారు. ముఖ్యంగా కేంద్ర, రాష్ట్ర, స్థానిక ప్రైవేటు భారీ కంపెనీలకు చెందిన ఇంజనీర్లు ,ఇతర విభాగాల మేనేజర్లకు నిరంతరం శిక్షణను అందించడంతోపాటు ప్రభుత్వ ఏజెన్సీలు, పరిశ్రమలకు కన్సల్టెన్సీ సేవలను సైతం అందిస్తుంది.

'ఎస్కీ'కి మోక్షం లభించేనా..?

- ఎస్కీలో నిర్వహించే కోర్సులకు ఏఐసీటీఈ గుర్తింపు లభించడమే కాకుండా ఈ సంస్థ ఐఎస్ఓ 50001: 2018, ఐఎస్ఓ 9001: 2015, ఐఎస్ఓ45001 :2018 గుర్తింపును కూడా పొందడం విశేషం.
- శిక్షణలో దేశంలో అత్యున్నత స్థాయికి ఎదిగిన ఎస్కీని విద్యారంగంలో కూడా ఐఎస్‌బీ, హెచ్‌సీయూ, జేఎన్‌టీయూ, ట్రిపుల్‌ఐటీ హైదరాబాద్ తరహాలో గుర్తించాలని కోరుతున్నారు.

'నిథమ్'కు రాష్ట్ర ప్లానింగ్ బోర్డు సిఫార్సు

తెలంగాణ రాష్ట్ర ప్లానింగ్ బోర్డు నిథమ్‌ను యూనివర్సిటీగా అప్‌గ్రేడ్ చేయాలని ప్రభుత్వానికి సిఫార్సు చేసింది. పర్యాటక, ఆతిథ్య రంగాలలో శిక్షణ, కోర్సుల నిర్వహణకు నిథమ్ కేంద్రం . 30 ఎకరాల స్థలంలో సొంత భవనాలు పైగా ఐటీకారిడార్‌కు చేరువలో ఉంది. ఏటా వందలాదిమందికి ఫుడ్ ప్రొడక్షన్, ఫుడ్ అండ్ బేవరేజెస్, హౌస్ కీపింగ్ సర్వీసులపై శిక్షణ అందిస్తోంది. ఇక పర్యాటక ఆతిథ్యరంగంలో బీబీఏ, ఎంబీఏ కోర్సులు, సర్టిఫికెట్ కోర్సులు, శిక్షణను కూడా అందిస్తోంది. ప్రైవేటు విద్యాసంస్థలకు యూనివర్సిటీ హోదాను కల్పిస్తున్న ప్రభుత్వం ఈ రెండు సంస్థలకు హోదా కల్పించాలని ఆయా సంస్థల అధికారులు, ఉద్యోగులు కోరుతున్నారు.

ఉచిత ఆరోగ్య కేంద్రం

హఫీజ్‌పేట్ : కొండాపూర్‌లోని సీఆర్ ఫౌండేషన్‌లో నాదెళ్ళ లక్ష్మయ్య మెమోరియల్ ఆరోగ్యం కేంద్రంలో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు వైద్య సేవలు అందుబాటులో ఉంటాయి. అవుట్ పేషంట్‌కు రూ.30లు చెల్లించాలి. ప్రతి రోజు సుమారు 25 మంది రోగులకు వైద్య పరీక్షలు అందిస్తారు. వైద్య పరీక్షలు చేసిన వారికి ఉచితంగా మందులు, మైనర్ ఆపరేషన్లు కూడా ఆరోగ్యం కేంద్రంలో నిర్వహిస్తారు .ఆదివారం సెలవు.

ఫలహారం బండి ఊరేగింపు

జిన్నారం(పటాన్‌చెరు): జిన్నారం మండలంలోని ఖాజీపల్లి గ్రామ పంచాయతీ పరిధిలో గల గొల్లగూడెం గ్రామంలో బుధవారం రెండో రోజు మల్లికార్జున స్వామి ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. స్థానిక నాయకులు కుమార్‌యాదవ్ ఆధ్వర్యంలో స్వామి, అమ్మవార్ల విగ్రహాలతో ఫలహారం బండి ఊరేగింపు చేపట్టారు. ఇందులో భాగంగా పోతరాజులు, మేకపోతుల విన్యాసాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. కార్యక్రమంలో ఎమ్మెల్యే సోదరుడు మధుసూదన్‌రెడ్డి, జెడ్పీ వైస్ చైర్మన్ ప్రభాకర్, నాయకులు శంకర్‌యాదవ్, విజయ్‌కుమార్, సత్యనారాయణ, ఆకుల నవీన్, గద్దె నర్సింహ, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

ఆస్‌బెస్టాస్ కాలనీలో సమ్మక్క, సారలమ్మ జాతర

ఆల్విన్‌కాలనీ: కూకట్‌పల్లి డివిజన్ పాపిరెడ్డినగర్, ఆస్‌బెస్టాస్ కాలనీలో సమ్మక్క, సారలమ్మ జాతరను అంగరంగ వైభవంగా నిర్వహించనున్నట్లు నిర్వాహకులు ఓ ప్రకటనలో తెలిపారు. బుధవారం శ్రీ సారలమ్మ తల్లి గద్దెకు, 22 గురువారం శ్రీ సమ్మక్క తల్లి గద్దెకు వస్తారు. 23వ తేదీ శుక్రవారం భక్తులు మొక్కులు సమర్పించుకుంటారు.24వ తేదీ అమ్మవార్ల వన ప్రవేశం తదితర కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. భక్తులు జాతరలో పాల్గొనాలని కోరారు.

'డిజిటల్ ఇండియా'పై వర్క్ షాప్

పటాన్‌చెరు: గ్రామీణ ప్రాంతాలలో డిజిటల్ ఇండియా ప్రభావం, తెలంగాణలో అన్వేషణాత్మక అధ్యయనం అనే అంశంపై గీతం విశ్వవిద్యాలయం ఒక రోజు వర్క్‌షాప్‌ని నిర్వహించినట్టు ప్రాజెక్టు డైరెక్టర్, గీతం అధ్యాపకుడు డాక్టర్ గుర్రం అశోక్ బుధవారం ఒక ప్రకటనలో వెల్లడించారు.ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ సోషల్ సైన్స్ రీసెర్చ్(ఐసీఎస్ఎస్ఆర్) సౌజన్యంతో దీనిని నిర్వహించినట్టు తెలిపారు. అట్టడుగుస్థాయిలో డిజిటల్ ఇండియాపై విధాన పరిశోధన ఆవశ్యకతను వివరించారు.

బొడ్రాయి ప్రతిష్ఠాపనోత్సవం



బొడ్రాయి పూజల్లో పాల్గొన్న మహిళలు

రాయదుర్గం: బొడ్రాయి ప్రతిష్ఠాపనోత్సవం సందర్భంగా గోపన్‌పల్లిలో పండగ వాతావరణం నెలకొంది. బుధవారం ఉదయం బొడ్రాయికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. గోపన్‌పల్లివాసులంతా బొడ్రాయిని దర్శించుకొన్నారు. ఉత్సవంలో ఎమ్మెల్యే గాంధీ, కార్పొరేటర్ గంగాధర్‌రెడ్డి, మాజీ కార్పొరేటర్ సాయిబాబా, బీజేపీ రాష్ట్ర కార్యవర్గసభ్యుడు రవికుమార్‌యాదవ్, నాయకులు, కార్యకర్తలు, పాల్గొన్నారు.

వేస్ట్ మేనేజ్‌మెంట్ అవేర్‌నెస్ ప్రోగ్రామ్

పటాన్‌చెరు టౌన్: ఎలక్ట్రానిక్ వ్యర్థాలను సమర్థవంతంగా రీ సైకిల్ చేయడం ద్వారా మానవాళిని ప్రమాదాల బారి నుంచి కాపాడవచ్చని టాస్క్ ట్రైనర్ సుప్రియ అన్నారు.బుధవారం పటాన్‌చెరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో టాస్క్ (తెలంగాణ అకాడమీ ఫర్ స్కిల్ అండ్ నాలెడ్జ్) ఆధ్వర్యంలో వేస్ట్ మేనేజ్‌మెంట్ అవేర్‌నెస్ సదస్సు నిర్వహించారు.ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన ప్రిన్సిపల్ డాక్టర్ రాజేంద్ర ప్రసాద్ మాట్లాడుతూ... ఎలక్ట్రానిక్ పరికరాల ఉపయోగం పెరుగుతున్న కొద్దీ వాటి వ్యర్థాల వలన కలిగే భారీ నష్టాల గురించి విద్యార్థులకు వివరించారు .కళాశాల కోఆర్డినేటర్ ఆర్ కృష్ణ , ప్రసన్న, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రత్యేక పూజలు



ఉత్సవాల్లో పాల్గొన్న కాలనీవాసులు

శేరిలింగంపల్లి: శేరిలింగంపల్లి నేతాజీనగర్‌లో శ్రీ అభయాంజనేయ స్వామి ఆలయ వార్షికోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. వేడుకల్లో భాగంగా బుధవారం ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షులు ఉప్పరి శేఖర్ సాగర్, ప్రధాన కార్యదర్శి వెంకటేష్ గౌడ్, కోశాధికారి రామేశ్వరం రెడ్డి, ఉపాధ్యక్షులు మల్లేశం ముదిరాజ్, ప్రతినిధులు మహేష్ కురుమ, సంతోష్, రమేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

38 మందికి జరిమానా

పటాన్‌చెరు టౌన్: డ్రంకన్ డ్రైవ్‌లో పట్టుబడ్డ వాహనదారులకు సంగారెడ్డి జిల్లా కోర్టు జరిమాన విధించిన సంఘటన పటాన్‌చెరు ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది .ట్రాఫిక్ సీఐ రామకృష్ణారెడ్డి తెలిపిన వివరాల ప్రకారం....సోమ, మంగళవారాల్లో నిర్వహించిన డ్రంకన్ డ్రైవ్‌లో 38 మందిని పట్టుబడగా వారిని బుధవారం సంగారెడ్డి కోర్టులో హాజరుపర్చగా, జడ్జి 38 మందికి ఒక్కొక్కరికీ రూ.వెయ్యి జరిమాన విధించినట్లు ట్రాఫిక్ పోలీసులు పేర్కొన్నారు.

అదృశ్యమైన బాలుడి ఆచూకీ లభ్యం

- తల్లిదండ్రులకు అప్పగించిన పోలీసులు

హఫీజ్‌పేట్ : చందానగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో సోమవారం అదృశ్యమైన బాలుడు సాత్విక్ బుధవారం ఆచూకీ లభించింది. లింగంపల్లి పరిసర ప్రాంతాలలో సీసీ కెమెరాలను పరిశీలించిన పోలీసులకు లింగంపల్లి మార్కెట్‌లో తిరుగుతూ కనిపించాడు. వెంటనే అప్రమత్తమైన పోలీసులు బాలుడు సాత్విక్‌ను తీసుకొచ్చి తల్లిదండ్రులకు సమాచారం అందించారు. సీఐ పాలవెల్లి సాత్విక్‌ను తల్లిదండ్రులైన కుమారస్వామి, సమతలకు అప్పగించారు. బాలుడి ఆచూకీని కనుగొన్న పోలీస్ సిబ్బందిని సీఐ అభినందించారు.

చికిత్స పొందుతూ కార్మికుడు మృతి

పటాన్‌చెరు టౌన్: చికిత్స పొందుతూ కార్మికుడు మృతి చెందిన సంఘటన బీడీఎల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. పటాన్‌చెరు మండల పరిధిలోని పాశమైలారం పారిశ్రామికవాడలోని సిఎంహెచ్ లాబొరేటరీస్ పరిశ్రమలో 13వ తేదీన పరిశ్రమలో కార్మికులు పనిచేసే చోట పేలిన ఘటనలో నలుగురికి తీవ్ర గాయాలైన విషయం తెలిసిందే. ఈ క్రమంలో హైదరాబాద్ కూకట్‌పల్లిలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఒరిస్సాకు చెందిన మొంటు మాలిక్ (27) మంగళవారం రాత్రి మృతి చెందాడు సమాచారం తెలుసుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టంకు తరలించి, ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

హోటల్‌కు వెళ్తున్నానని చెప్పి..

పటాన్‌చెరు టౌన్: హోటల్‌కు వెళ్తున్నానని చెప్పి వెళ్లిన మహిళ అదృశ్యమైన సంఘటన బీడీఎల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం... వెస్ట్ బెంగాల్ కు చెందిన సుభాష్ ముడీ, తుంపపాత్ర(25) బతుకుదెరువు కోసం రెండు నెలల క్రితం పటాన్‌చెరు మండల పరిధిలోని పాశమైలారంలో ఉంటున్నారు. సుభాష్ ముడీ ఓ ప్రైవేట్ కంపెనీలో పని చేస్తుండగా, అతడి భార్య తుంప పాత్ర పాశమైలారంలోని వాసుదేవ హోటల్లో పని చేస్తోంది. ఈ క్రమంలో రోజు మాదిరిగానే మంగళవారం హోటల్‌కు వెళ్తున్నానని చెప్పి వెళ్లిన తుంబ పాత్ర హోటల్ కి వెళ్లి అక్కడి నుండి చెప్పకుండా వెళ్ళిపోయింది.దీంతో సుభాష్ తన భార్య కోసం తెలిసిన వారి వద్ద, స్థానికంగా వెతికిన ఆచూకీ లభించలేదు.బుధవారం భార్య అదృశ్యంపై భర్త సుభాష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు, పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

ఆదిత్యనగర్ కాలనీలో ఎమ్మెల్యే పర్యటన



ఆదిత్యనగర్‌వాసులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గాంధీ

హఫీజ్‌పేట్ : మాదాపూర్ డివిజన్ పరిధిలోని ఆదిత్యనగర్ కాలనీ అభివృద్ధికి కృషి చేస్తానని ఎమ్మెల్యే ఆరికెపూడి గాంధీ పేర్కొన్నారు. బుధవారం డివిజన్ పరిధిలోని ఆదిత్యనగర్‌లో నెలకొన్న సమస్యలను స్థానికులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాలనీలో సుమారు రూ.43 లక్షలతో సీసీ రోడ్లు వేస్తున్నామన్నారు. అనంతరం ఈద్గాను పరిశీలించారు. కాలనీలో వీధి దీపాలు, విద్యుత్ సమస్యలు తన దృష్టికి వచ్చాయని అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామన్నారు. కార్యక్రమంలో అధికారులు ఏఈ ప్రశాంత్, జలమండలి డీజీఎం శరత్‌రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు శ్రీనివాస్ యాదవ్, సాంబశివరావు, బాబు మియా, ఖాసీం, లియాఖత్ తదితరులు పాల్గొన్నారు.

ఫుట్‌పాత్ ధ్వంసం

- ఆగ్రహం వ్యక్తం చేస్తున్న స్థానికులు



ప్రశాంత్‌నగర్ కాలనీలో ఫుట్‌పాత్‌ను తొలగించి వేసిన దృశ్యం

మియాపూర్: లక్షల రూపాయలతో నిర్మించిన ఫుట్‌పాత్‌లను తమ వ్యాపారాల కోసం ఎక్కడపడితే అక్కడ ధ్వంసం చేస్తున్నా పట్టించుకునే వారు కరువయ్యారు. మియాపూర్‌లోని ప్రశాంత్ నగర్ కాలనీ ప్రధాన రహదారిపై కారు సర్వీస్ సెంటర్ నిమిత్తం ఫుట్‌పాత్‌ను తొలగించేశారు.ఈ రహదారిపై కొంతకాలం క్రితం లక్షల రూపాయల నిధులతో పాదచారుల కోసం ఫుట్‌పాత్ నిర్మించారు. రహదారిపై కొన్నిచోట్ల ఫుట్‌పాత్‌లు తొలగించి వేశారు. అధికారులు పట్టించుకోకపోవడంతో ప్రస్తుతం అదే తరహాలో సర్వీస్ సెంటర్ కోసం ఫుట్‌పాత్‌ను తొలగించేరని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత అధికారులు స్పందించి ఫుట్‌పాత్‌లు ధ్వంసం చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

కార్పొరేటర్‌కు వినతి

రామచంద్రాపురం(పటాన్‌చెరు): రామచంద్రాపురం డివిజన్ పరిధిలోని సాయిజ్యోతి నగర్ కాలనీలో బుధవారం కార్పొరేటర్ పుష్ప నగేష్ అధికారులతో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా కాలనీవాసులు పలు సమస్యలపై వినతిపత్రం అందించారు. ప్రధానంగా డ్రైనేజీ సమస్య తీవ్రంగా ఉందని సమస్య పరిష్కరించాలని కోరారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కాలనీవాసులు తన దృష్టికి తీసుకు వచ్చిన సమస్యను త్వరలో పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు.

అక్రమ నిర్మాణాల కూల్చివేత

రామచంద్రాపురం(పటాన్‌చెరు): తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని కొల్లూర్ సర్వే నంబర్ 297లో అక్రమంగా నిర్మించిన సుమారు 15 ఇళ్లను రెవెన్యూ అధికారులు బుధవారం కూల్చివేశారు. తహసీల్దార్ సంగ్రామ్‌రెడ్డి ఆదేశాల మేరకు డిప్యూటీ తహసీల్దార్ విశ్వేశ్వర్, ఆర్ఐ శ్రీకాంత్ పోలీసుల సహకారంతో కూల్చివేతలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ భూముల్లో నిర్మాణాలు చేపడితే చర్యలు తప్పవని హెచ్చరించారు.

పగలూ వెలుగులు..

ఆల్విన్‌కాలనీ: కూకట్‌పల్లి వివేకానందనగర్ కాలనీలో పగలూ వీధి లైట్లు వెలుగుతున్నాయి. విద్యుత్ అధికారుల నిర్లక్ష్యంతో కొన్ని నెలలుగా వెలుగుతూనే ఉన్నాయని స్థానికులు తెలిపారు. మరికొన్ని వీధుల్లో వీధి దీపాలే వెలగడం లేదని ,ఏవైనా దొంగతనం కేసుల్లో సీసీ కెమెరాలు సైతం కనిపించకుండా చీకటిమయంగా ఉంటున్నాయని పేర్కొన్నారు. వీధి దీపాలకు ఆటోమెటిక్ సెన్సింగ్ ఉన్నప్పటికి అవి పనిచేయడం లేదని మరమ్మత్తులు చేయకుండా నిర్లక్ష్యం వహిస్తున్నారని స్థానికులు పేర్కొంటున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.



వివేకానందనగర్ కాలనీలో..

సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన



రోడ్డు పనులకు శంకుస్థాపన చేసిన ఎంపీపీ, జెడ్పీటీసీ, అధికారులు

పటాన్‌చెరు టౌన్: ఎస్ఆర్ ఈజీఎస్ నిధులను సద్వినియోగం చేసుకోవాలని పటాన్‌చెరు ఎంపీపీ సుష్మ శ్రీ, ,జెడ్పీటీసీ సుప్రజ అన్నారు.బుధవారం పటాన్‌చెరు మండల పరిధిలోని ముత్తంగి, చిట్కుల్, బచ్చుగూడెం, ఇంద్రేశం, పోచారం , రామేశ్వరం బండ, ఐనోల్, చిన్నకంజర్ల, పెద్ద కంజర్ల గ్రామాల్లో ఒక కోటి 20 లక్షలతో సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ యాదగిరిగౌడ్ ,మండల పంచాయతీ అధికారి హరిశంకర్‌గౌడ్, కార్యదర్శులు దయానంద్, కవిత, భవాని ఆయా గ్రామాల తాజా మాజీ సర్పంచులు ,ఎంపీటీసీలు,మాజీ వార్డు సభ్యులు పాల్గొన్నారు.

ఉపసర్పంచ్ సొంత నిధులతో రోడ్డు

పటాన్‌చెరు మండల పరిధిలోని ఇంద్రేశం గ్రామ తాజా మాజీ ఉపసర్పంచ్ శివకుమార్‌గౌడ్ బుధవారం సొంత నిధులు రూ.40 లక్షలతో కాలనీలో రోడ్డు పనులకు పంచాయతీ కార్యదర్శి సుభాష్, తాజా మాజీ సర్పంచ్ దండు నర్సింలతో కలిసి శంకుస్థాపన చేశాడు.ఈ సందర్భంగా రాయల్ కాలనీవాసులు, నాయకులు శివ కుమార్ గౌడ్‌ను సన్మానించారు.

భాష, సంస్కృతి ఒకదానితో ఒకటి ముడిపడి ఉంటాయి




కొండాపూర్ జెడ్పీహెచ్ఎస్‌లో మాతృభాషా దినోత్సవంలో మాట్లాడుతున్న హెచ్‌సీయూ ప్రొఫెసర్ పి వారిజారాణి

హెచ్‌సీయూ ప్రొ.వారిజారాణి

గచ్చిబౌలి: నీతి, నిజాయితీ, మంచి నడవడిక నేర్పేది మాతృభాషయేనని హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ ప్రొఫెసర్ పి వారిజారాణి పేర్కొన్నారు. అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవాన్ని పురస్కరించుకొని శేరిలింగంపల్లి డివిజన్‌లోని కొండాపూర్ జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో ఫ్రెండ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ కన్వీనర్ టి రామస్వామియాదవ్ ఆధ్వర్యంలో బుధవారం సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తల్లి భాషలేనిదే మానవజాతికి వికాసం లేదని, అన్యభాషలు ఎన్ని నేర్చుకున్నా మాతృభాషలో ప్రావీణ్యుడు కాలేనివాడు విజ్ఞాన సముపార్జన చేయలేడని స్పష్టం చేశారు. ఎంతో ప్రాధాన్యత కలిగిన తల్లి భాష నేడు తల్లడిల్లుతుందని ఆవేదన వ్యక్తంచేశారు. ప్రపంచ వ్యాప్తంగా వేల కొలది మాతృభాషలు కనుమరుగయ్యే పరిస్థితులు ఉన్నాయంటూ యునెస్కో హెచ్చరిస్తుందని గుర్తుచేశారు. ప్రపంచీకరణ వలన ప్రపంచమంతా మనకు దగ్గరవుతుండగా మన భాష మాత్రం మనకు దూరమువతుందన్నారు. భాష, సంస్కృతులు ఒకదానితో ఒకటి ముడిపడి ఉంటాయని, కాబట్టి మారుతున్న మన సంస్కృతితోపాటు మన భాష కూడా మార్పులు చెందుతూ ఉంటుందన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు పల్లె అనంతరెడ్డి, ఉపాధ్యాయులు నాగలక్ష్మీ, పుష్పలీల, స్వాతి, అసోసియేషన్ సభ్యులు వాణి సాంబశివరావు, శ్రీనివాస్, జనార్దన్, శివరామకృష్ణ, అమ్మయ్యచౌదరి విద్యార్థులు పాల్గొన్నారు.

అభివృద్ధికి మహిళల మద్దతు అవసరం



మాట్లాడుతున్న ప్రొ.ఇష్తియాక్ అహ్మద్

రాయదుర్గం: ఏ సమాజం అభివృద్ధి చెందాలన్నా మహిళల మద్దతు వసరమని 'మనూ' రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఇష్తియాక్ అహ్మద్ అన్నారు. గచ్చిబౌలిలోని మౌలానా ఆజాద్ జాతీయ ఉర్దూ విశ్వవిద్యాలయంలో డిపార్ట్‌మెంట్ ఆఫ్ హిస్టరీ సహకారంతో ఫర్‌ది స్టడీ ఆఫ్ సోషల్ ఎక్స్‌క్లూజన్ అండ్ ఇన్‌క్లూజివ్ పాలసీ ఆధ్వర్యంలో 'భారతదేశం లో ఉమెన్స్ మార్జినలైజేషన్ యొక్క డైనమిక్స్ ఎక్స్‌ప్లోరింగ్-చాలెంజెస్ అండ్ ప్రాస్పెక్ట్స్' అంశంపై రెండు రోజుల జాతీయస్థాయి సెమినార్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ మహిళల మినహాయింపు, వివక్ష గురించి అధ్యయనం చేయడం ప్రస్తుత తరుణంలో ఎంతో అవసరముందన్నారు. అనంతరం సెమినార్‌లో 25కు పైగా పరిశోధనా పత్రాలను సమర్పించారు.

ఆగుతూ.. సాగుతూ..



పెద్దషాపూర్ చౌరస్తా...



ఘాంసిమియాగూడ శివారులో జాతీయ రహదారి విస్తరణ పనులు

జాతీయ రహదారి విస్తరణ పనులు మందకొడిగా సాగుతున్నాయి. పనుల్లో భాగంగా భద్రత చర్యలు కూడా సరిగ్గా లేకపోవడంతో వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు.

- జాతీయ రహదారి పనులు పూర్తయ్యేదెన్నడు?
- వాహనదారులకు తప్పని ఇబ్బందులు

శంషాబాద్ రూరల్: మండలంలోని తొండుపల్లి శివారు నుంచి కొత్తూరు వరకు బెంగళూరు జాతీయ రహదారి విస్తరణ పనులు చేపట్టారు. నాల్గు లైన్ల రహదారిని ఆరు లైన్లకు విస్తరిస్తున్నారు. సుమారు ఏడాది క్రితం పనులు ప్రారంభం కాగా.. ఎప్పుడు పూర్తి చేస్తారో తెలియడం లేదని ప్రజలు వాపోతున్నారు.

పెరిగిన వాహనాల రద్దీ..

శ్రీనగర్ నుంచి కన్యాకుమారి వరకు ఉన్న ఈ 44వ నంబరు జాతీయ రహదారిపై ఈ ప్రాంతంలో వాహనాల రద్దీ బాగా పెరిగింది. రాష్ట్ర, ఇతర రాష్ట్రాల వాహనాలు ఈ మార్గంలోనే రాకపోకలు సాగిస్తుంటాయి. తొండుపల్లి వద్ద ఉన్న ఔటర్ రింగు రోడ్డు, అంతర్జాతీయ విమానాశ్రయం, హైదరాబాద్‌తో పాటు వివిధ ప్రాంతాలకు షాద్‌నగర్ వైపు నుంచి రాకపోకలు సాగించేవారు ఈ మార్గంలోనే ప్రయాణం చేయాలి. వారాంతపు, సెలవు రోజుల్లో ట్రాఫిక్ మరింత పెరుగుతుంది. ముచ్చింతల్ వద్ద ఉన్న సమతామూర్తి కేంద్రానికి సందర్శకుల తాకిడి కూడా పెరిగింది.

రహదారి టర్నింగ్‌లకు చెక్..

జాతీయ రహదారిని ఆరు వరుసలకు విస్తరిస్తుండటంతో పాటు టర్నింగ్‌లను సైతం సరి చేస్తున్నారు. దీంతో ప్రమాదాలు జరిగే అవకాశాలు తగ్గిపోతాయి. గండిగూడ, ఘాంసిమిగూడ, పెద్దషాపూర్‌తండా, మదన్‌పల్లితండా వద్ద టర్నింగ్స్ ప్రమాదకరంగా ఉన్నాయి. వీటిని సరి చేస్తుండటంతో భవిష్యత్తులో వాహనదారులకు ఇబ్బందులు ఉండవు.

కల్వర్టుల నిర్మాణం..

ప్రస్తుతం రహదారిపై కల్వర్టులు, రోడ్డుకు ఇరువైపులా వరదనీటి కాలువల ఏర్పాటు పనులు కొనసాగుతున్నాయి. ఘాంసిమియాగూడ శివారులో కల్వర్టు నిర్మాణ ప్రాంతంలో రెండు నెలల క్రితం ప్రమాదం జరిగి ఇద్దరు మృతి చెందారు. రోడ్డు పక్కన భద్రత చర్యల లోపంతోనే ఈ ప్రమాదం జరిగినట్లు స్థానికులు ఆరోపిస్తున్నారు.

విస్తరణ ప్రణాళికపై అభ్యంతరాలు..

రహదారి విస్తరణ కోసం రూపొందించిన ప్రణాళికపై స్థానికుల నుంచి అభ్యంతరాలు వ్యక్తమౌతున్నాయి. పెద్దషాపూర్, పాల్మాకుల గ్రామాల వద్ద ట్రాఫిక్ ఎక్కువగా ఉంటోంది. ఇక్కడ రోడ్డు దాటే సమయంలో పాదచారులు, వాహనదారులు ప్రమాదాలకు గురై ప్రాణాలు కోల్పోతున్నారు. ప్రస్తుతం చేపట్టిన విస్తరణ పనుల్లో ప్రమాదాల నివారణకు ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని స్థానికుల వాదన.

- పెద్దషాపూర్ వద్ద అండర్‌పాసు నిర్మించాలని స్థానికులు ఇది వరకే జాతీయ రహదారి విభాగం అధికారులను కోరారు. ఇక పాల్మాకుల వద్ద అండర్‌పాస్ కాకుండా పై వంతెన నిర్మాణం చేయాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

దేవాలయ భూములు కాపాడండి

పటాన్‌చెరు టౌన్: దేవాలయ, ప్రభుత్వ భూములను, సాకి చెరువు చుట్టూ ఉన్న ప్రభుత్వ భూమిని కబ్జాల నుండి కాపాడాలని తహసీల్దార్ రంగారావుకు బుధవారం ఐఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు నర్సింహారెడ్డి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నర్సింహారెడ్డి మాట్లాడుతూ.. సాకి చెరువు చివరి భాగం వరకు సుమారు 3 ఏకరాల ప్రభుత్వ భూమిని గడిచిన 2 సంవత్సరాలుగా ఆక్రమిస్తున్నారని ఆరోపించారు. చర్యలు తీసుకోవాలని కోరారు.

మల్లన్నస్వామి కల్యాణం

- పాల్గొన్న ఎమ్మెల్యే గాంధీ

మాదాపూర్: కొండాపూర్ డివిజన్‌లోని మాదాపూర్ విలేజ్‌లో బుధవారం శ్రీ మల్లికార్జున స్వామి ఆలయంలో జరిగిన శ్రీ మల్లన్న స్వామి కల్యాణంలో శేరిలింగంపల్లి నియోజకవర్గం ఎమ్మెల్యే గాంధీ పాల్గొన్నారు. అనంతరం ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు ఎర్రగుడ్ల శ్రీనివాస్ యాదవ్, కిట్టుయాదవ్, భిక్షపతి ముదిరాజ్, ఐలేష్ యాదవ్, మనీష్‌యాదవ్, సాయియాదవ్, రాజు తదితరులు పాల్గొన్నారు.